## క్లుప్తంగా

### ఆనందపురంలో వైద్యసేవలు

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సచివాలయం పరిధిలోని ఆనందపురం, ఆబోతులపేట, ధవళపేట గ్రామాల్లో దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్న వారికి తనిఖీలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కె.రమాదేవి, ఏఎస్‌ఎం ఎం.నాగమణి, సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### కొండచిలువ కలకలం


చనిపోయిన కొండచిలువ

గార : శాలిహుండం గ్రామంలో మంగళవారం కొండచిలువ కలకలం సృష్టించింది. స్థానిక జీడిమామిడి తోటలో పనిచేసేందుకు వెళ్లగా సుమారు 11 అడుగుల కొండచిలువ కనిపించింది. వెంటనే భయంతో కర్రలతో కొట్టి చంపేశారు. వంశధార నది సమీపంలో పొలం ఉండటంతో వరదనీటి ద్వారా వచ్చి ఉంటుందని భావిస్తున్నారు.

### పోలీసు విధులపై అవగాహన


గార మ్యాపును చూపిస్తున్న ఎస్‌ఐ జనార్దన

గార: పోలీసుల విధులపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ ఆర్.జనార్దన అన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా గార పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శాంతినికేతన్ విద్యార్థులతో కలిసి మంగళవారం నిర్వహించారు. నేరాలను ముందుస్తుగా గమనించడం, గొడవలు జరగకుండా చూడటం, కొన్ని ప్రాంతాల్లో నిఘా ఉంచడం, కానిస్టేబుళ్లను బీట్ పాయింట్లు వద్ద ఉంచడం, సీసీ కెమెరాల పనితీరు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న బొమ్మలకొలువు


బొమ్మల కొలువును తిలకిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శార్వాణీ విద్యాలయలో చదువుతున్న విద్యార్థులు మంగళవారం జెడ్పీ ఎదురుగా ఉన్న చిన్మయా మిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి పర్మానంద సరస్వతి చిన్నారులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం బొమ్మలకొలువును సందర్శించారు.

### శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి


ఎచ్చెర్ల స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ

ఎచ్చెర్ల క్యాంపస్: స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించి స్టేషన్ రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై వి.సందీప్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్పీ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

### యాంత్రీకరణతో అధిక దిగుబడులు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: యాంత్రీకరణ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి వై.సురేష్ అన్నారు. అల్లినగరం, అరిణాం అక్కివలస గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక ప్రగతి, యాంత్రీకరణ ఉపయోగించుకుని సాగు ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. అనుబంధ రంగాలైన డెయిరీ, కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు టి.మణి, అంబటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ స్వాతి పాల్గొన్నారు.

### లలితాదేవికి విశేష అభిషేకాలు

ఎచ్చెర్ల : శ్రావణశుద్ధ పౌర్ణమి సందర్భంగా దోమాంలోని లలితాదేవి అమ్మవారికి మంగళవారం పాలాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు వంశీకుమార్, ఆలయ ధర్మకర్త నరసింగారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



### పొంచి ఉన్న ప్రమాదం

దీపావళి కూడలి నుంచి బలరాంపురం వెళ్లే సీఎస్‌పీ రోడ్డులో ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తోందనని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. మలుపుల వద్ద వాహనాలు దగ్గరగా వచ్చే వరకూ కనిపించడం లేదు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– గార



### మరుగుదొడ్లు నిరుపయోగం

జి.సిగడాం మండలం గొబ్బూరులో 2018లో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. రన్నింగ్ వాటర్ సౌకర్యం లేక వీటిని ఎవరూ వినియోగించడం లేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వేలాది రూపాయలతో నిర్మించిన ఇవి మూలకు చేరి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

– జి.సిగడాం



### రహదారి గోతులమయం

శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలోని కుశాలపురం– వెంకటాపురం తారురోడ్డు గోతులమయంగా మరింది. యాతపేట నుంచి యూనియన్ బ్యాంకు వరకు ఉన్న ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డులో గోతులు ఏర్పడటంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



### నేలబావి.. ప్రమాదకరం

పాగిరి నుంచి పెంట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో నేల బావి ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు, ప్రయాణికులు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా బావిలోకి దూసుకెళ్లే ప్రమాదముంది. అధికారులు స్పందించి బావి చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

– జి.సిగడాం

# తవ్వారు.. వదిలేశారు!

- 80 అడుగుల రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం
- నెలలు గడుస్తున్న ముందుకు సాగని పనులు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు


ఎంపీ కార్యాలయం సమీపంలో ఉన్న పైపులు

శ్రీకాకుళం: నగరంలోని 80 అడుగుల రోడ్డులో ప్రమాదం పొంచి ఉంది. మున్సిపల్ అధికారులు రెండు చోట్ల రోడ్డును తవ్వించి అలాగే వదిలేశారు. మిర్తిబట్టి మరమ్మతులో భాగంగా ఒక చోట పైపు లైన్లు అమర్చేందుకు, మరో చోట కాలువ నిర్మాణం కోసం తవ్వకాలు జరిపారు. నెలలు గడుస్తున్న పనులు అలాగే నిలిచిపోయాయి. ఇదే రోడ్డులో ఎంపీ కార్యాలయం ఉన్న ప్రాంతంలో మాత్రమే రాత్రివేళ వీధి దీపాలు వేస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో లైట్లు వెలగడం లేదు. దీంతో 80 అడుగుల రోడ్డులో రాత్రివేళ రాకపోకలు సాగించే ప్రయాణికులకు గోతులు కనిపించే అవకాశం లేకుండా పోతోంది. తరచూ ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోజుల వ్యవధిలోనే రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అరసవల్లి (మిల్లు) జంక్షన్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఈ రోడ్డులో ప్రతి రోజు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరితో పాటు ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, ఇతరులు వందలాదిగా రాకపోకలు సాగిస్తుంటారు. అయినా అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ రోడ్డు సమస్యపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పెద్ద ప్రమాదం చోటు చేసుకోకముందే పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

#### త్వరలో పూర్తి చేస్తాం

80 అడుగుల రోడ్డులోని రెండు ప్రాంతాల్లో రోడ్డు తవ్వించిన ప్రాంతాల్లో సాంకేతిక పరమైన ఇబ్బందులు కారణంగా పనులు నిలిచిపోయాయి. వీటిని త్వరలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ సిబ్బందిని పంపించి గోతులు ఉన్న ప్రాంతాల్లో వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– దక్షిణామూర్తి, మున్సిపల్ ఇంజనీర్, శ్రీకాకుళం

#### భయంగా ఉంది



వాంబే కాలనీ సమీపంలో నివాసం ఉంటున్నాను. కాలనీకి సమీపంలోనే పనిచేస్తున్నాను. ప్రతి రోజు ఇంటికి వచ్చేటప్పటికి చీకటి పడుతుంది. రోడ్డు తవ్వి ఉన్న ప్రాంతానికి వచ్చేసరికి భయంగా ఉంటోం. కొద్ది రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ వ్యక్తి ఇసుక బండిని తప్పించుకోబోయి గోతిలో పడి గాయాల పాలయ్యాడు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

– నందిని, వాంబే కాలనీ, శ్రీకాకుళం


వాంబే కాలనీలో ప్రమాదకరంగా రోడ్డు

## గ్రామసభలతో భూసమస్యల పరిష్కారం


జి.సిగడాం:మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్


గార: మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

జి.సిగడాం: భూముల రీసర్వేలో నెలకొన్న సమస్యలకు గ్రామసభల ద్వారా పరిష్కారం దొరుకుతుందని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఆనందపురం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో ఎక్కువగా కోర్టులో కేసులు ఉండటంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సమావేశంలో సర్పంచ్ చిత్తిరి మోహన్, బీజేపీ అధ్యక్షుడు వజ్జిపత్తి రఘురాం, భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి, సర్వేయర్ మెట్ట శ్రీరామమూర్తి, మొయ్యి ఈశ్వరరావు, రాజు, వీఆర్‌ఓ వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

గార: భూ రీ–సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతామని తహశీల్దార్ ఎస్.రమణారావు అన్నారు. గార మండలం అంబళ్లవలస రెవెన్యూ గ్రామపరిధిలో భూముల సమస్యపై మంగళవారం సర్పంచ్ అరవల రామారావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. 39 వినతులు స్వీకరించారు. సమావేశంలో డీటీ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎటు వంటి భూ సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని భూ సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. పూడివలసలో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.సింహాచలం, డీటీ త్రినాథరావు, ఆర్ఐలు రఘు, జీఎస్ శ్రీను పాల్గొన్నారు.

రణస్థలం: రీ–సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరించి సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎస్.ప్రసాద్ అన్నారు. మండలంలోని రావాడ, ఉప్పివలస గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న అర్జునవలస, గిరివానిపాలెం, 24న సీతంవలస, గరికిపాలెం, 25న దేవునిపాలవలస, చిట్టివలస, 26న నారువ, బోయపాలెం, అక్కయ్యపాలెం, 28న కోటపాలెం, జీరుపాలెం, 29న పాతసుందరపాలెం, కొల్లి భీమవరం, 30న పాతర్లపల్లి, నవంబర్1న నెలివాడ, 2న వల్లభరావుపేట, వెంకటరావుపేట, 5న మక్తుంపురం, కమ్మసిగడాం, 6న తిరుపతిపాలెం, బంటుపల్లి, 7న వెల్పురాయి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో మండల సర్వేయర్ రవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

## ముగిసిన బీఓఎస్ సమావేశం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో మంగళవారం నిర్వహించిన 6వ బోర్డ్ ఆఫ్ స్టడీ మీటింగ్ (బీఓఎస్) ముగిసింది. 2024–25 విద్యా సంవత్సరానికిగాను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన బీఓఎస్‌లో భాగంగా కళాశాలలో మొత్తం 18 విభాగాలకు సంబంధించి వర్సిటీ ప్రతినిధులు, ఆయా అటానమస్ కళాశాలల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. కోర్సులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రణాళిక తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త డాక్టర్ వై.గీతాశ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, అకాడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఎస్.పద్మావతి, టి.ఆదిలక్ష్మి, పీఎస్ కనకదుర్గ, వై.ప్రశాంతి, సంతోష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడా దుస్తుల వితరణ


క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సెపక్‌తక్ర సీనియర్స్ పురుషులు, మహిళల జట్లకు మంగళవారం జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి క్రీడా దుస్తులను అందజేశారు. శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో జరుగుతున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ సెపక్‌తక్ర చాంపియన్‌షిప్–2024 పోటీల్లో జిల్లాను విజయపథంలో నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి అర్జున్‌రావురెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం

ఎచ్చెర్ల : మురపాక పంచాయతీలో పైపులైన్ లీకై తాగునీరు వృథాగా పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రతినిధి పెయ్యిల లక్ష్మణరావు మూడు రోజుల పాటు పైపులైన్లను సరిచేయించారు. మరమ్మత్తులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు.

## ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.అరసవల్లి జంక్షన్ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులకు సీనియర్లు ఆహ్వానం పలికారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి హనుమంతు పోలినాయుడు, డాక్టర్ రామకృష్ణ, పురుషోత్తం, వీటీ నాయుడు, ప్రిన్సిపాళ్లు తమ్మినేని రామారావు, కొత్తకోట రవీంద్ర, ఏవో హెచ్ బోసుబాబు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని తాపీ మేస్త్రీ మృతి

పీఎం పాలెం: మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మరణించిన సంఘటన పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం చిన్నయ్యపేట గ్రామానికి చెందిన మీసాల ఆనందరావు(32) తాపీ మేస్త్రీ పనులు చేస్తుంటాడు. పీఎం పాలెంలోని సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న సూర్యతులసీ నగర్‌లోని ఓ రేకుల షెడ్‌లో భార్య సంతోషి, పిల్లలతో నివసిస్తున్నాడు. తాగుడుకు బానిస అయిన ఆనందరావు భార్యా పిల్లలను పట్టించుకోకపోవడంతో నాలుగు రోజుల కిందట పిల్లలను వెంట తీసుకుని భార్య రణస్థలం మండలంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆనందరావు సోమవారం రాత్రి అదే ప్రాంతంలో నివసిస్తున్న పిన్ని ఇంటి వద్ద భోజనం చేసి, అక్కడే పడుకున్నాడు. మంగళవారం ఉదయం 6.30గంటలకు తన ఇంటికి వచ్చేశాడు. పరదేశిపాలెంలో నివసిస్తున్న ఆనందరావు తండ్రి జగన్నాథరావు కొడుకుకు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. అనుమానం వచ్చి ఉదయం 8.30 గంటల సమయంలో కొడుకు ఇంటికి వచ్చి, చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## ఆధార్ శిబిరాలను వినియోగించుకోండి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి బి.శాంతిశ్రీ

గార : గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని ఆమె పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఆధార్ సేవలు అందించేందుకు ఈ క్యాంపులు ఉపయోగపడతాయన్నారు. అనంతరం రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. బుధవారం అంపోలు, గురు, శుక్రవారం శ్రీకూర్మం పంచాయతీల్లో ఆధార్ క్యాంపులు జరగనున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ ఎం.రాము, సీడీపీవో రాధామాధవి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాల సమయాల్లో శిక్షణ తగదు


కొవ్వాడలో సమావేశమైన యూటీఎఫ్ నాయకులు

రణస్థలం: పాఠశాల సమయాల్లో ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు 14 విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల బోధనకు తీవ్ర విఘాతం కలుగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ అన్నారు. కొవ్వాడతో పాటు పలు ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ పేరిట ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం తగదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బి.రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.నారాయణరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రామారావు, ఎల్.కోదండరామయ్య, నాయకులు టి.శంకరరావు, డి.కోటేశ్వరరావు, సంతోష్‌కుమార్, కుమారస్వామి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## వసతి గృహాల తనిఖీ


మోడల్ పాఠశాలల్లో బాలికలతో మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, మోడల్ పాఠశాల పరిధిలోని వసతి గృహాలను పొందూరు జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక, వార్డెన్ కుమారి, న్యాయవాదులు నక్క ప్రసాదరావు, ఈశ్వరరావు, రాము, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

## తీరప్రాంతాల్లో అప్రమత్తం


సమీక్ష నిర్వహిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: దానా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం తీర ప్రాంత గ్రామాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా బొంతలకోడూరు, బడివానిపేట, డి.మత్స్యలేశం, బుడగట్లపాలెంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ షెల్టర్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సింహాచలం, అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎడిటర్‌గా గోవిందరెడ్డి


గోవిందరెడ్డిని అభినందిస్తున్న వీసీ రజిని, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ సెకెండియర్ విద్యార్థి మునకాల గోవిందరెడ్డి 'గురుకులం' తెలుగు లఘుచిత్రానికి గాను ఉత్తమ ఎడిటర్‌గా అవార్డు అందుకున్నారు. భువనేశ్వర్‌లో ఇటీవల అంతర్జాతీయ ఒడిశా చలన చిత్రోత్సవం నిర్వహించారు. 2023లో తాను ఎడిట్ చేసిన గురుకులం ఎంట్రీని పంపించగా అవార్డుకు ఎంపికైంది. గ్రాఫిక్ అండ్ ఎడిట్ విభాగంలో రాణిస్తున్న ఈ విద్యార్థి హైదరాబాద్‌కు చెందిన ఆదర్శ కళానియం సంస్థ నుంచి కూడా స్వర్ణ నంది పురస్కారం అందుకున్నాడు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామానికి చెందిన గోవిందరెడ్డిని మంగళవారం వీసీ రజిని, అధికారులు అభినందించారు.

## పల్లెప్రగతిలో భాగస్వామ్యంకండి



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు గ్రామీణ ప్రగతిలో భాగస్వాములు కావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో మంగళవారం ఉన్నత భారత్ అభియాన్‌పై మాట్లాడారు. సాంకేతికత ప్రగతి గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాలు ప్రగతి సాధిస్తేనే దేశ ప్రగతి సాధ్యమని చెప్పారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ కావ్యజ్యోత్స్న, ప్రిన్సిపాళ్లు అనురాధ, ఉదయ్‌భాస్కర్, సీహెచ్ రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైద్యంతో ఆరోగ్యం


డాక్టర్‌ను సత్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: నిత్య యోగ సాధన , ప్రకృతి వైద్యం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ చిలుకు లక్ష్మీకాంత్ అన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రకృతి వైద్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఔషధ రహిత వైద్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాకర్స్ సంస్థ ప్రతినిధులు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.